# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 101 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

15-02-2026 ఆదివారం వెల : 1 /- పేజీలు : 4


# మహా శివరాత్రికి విశిష్ట ఆధ్యాత్మిక ప్రసస్తి

## కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**నవతరం -శ్రీకాకుళం**

ఫిబ్రవరి 14 : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. విశేష ఆధ్యాత్మిక ప్రసస్తి కలిగిన మహాశివరాత్రి పండుగను అందరూ భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు. ఇదే సందర్భంలో శ్రీకాకుళం జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలు అయిన శ్రీముఖలింగం, ఉమారుద్ర కోటేశ్వర ఆలయం, రావివలస ఎండల మల్లిఖార్జున క్షేత్రంతో పాటు మిగిలిన ఆలయాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు చరవాణి ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధాన ఆలయాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా చేపట్టిన మౌలిక వసతుల కల్పన గురించి ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా దర్శనం జరిగేలా ఏర్పాటు చెయ్యాలని సూచించారు. ఎక్కువమంది ఉపవాస దీక్షలు చేస్తున్న సందర్భంలో ఆలయాల్లో మంచినీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో



ఉండేలా చూడాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన చర్యల గురించి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు జిల్లా అధికారులు పరిస్థితులను వివరించారు.

# పిల్లలందరికీ డీవార్మింగ్ మాత్రలు వేయిద్దాం




**నవతరం -శ్రీకాకుళం**

నులిపురుగులు లేని ఆరోగ్యకరమైన జిల్లా కోసం పిల్లలందరికీ డీవార్మింగ్ మాత్రలు వేయిద్దామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె అనిత అన్నారు.

జిల్లాలో ఈ నెల 17 న డీ వార్మింగ్ డే నిర్వహించి జిల్లా వ్యాప్తంగా ఉన్న 4,27,000 వేల మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ -400 మీ.గ్రా మాత్రలు పంపిణీ చేసి.. అక్కడే పిల్లలతో మాత్రలు వేయిస్తామని ఆమె పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ... రక్తహీనత లేని సమాజ స్థాపనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని చేపడటున్నయని ఆమె అన్నారు. 1-19 సంవత్సరాల లోపు వారికి విధిగా నులుపురుగుల నివారణకు ఈ మాత్రలు వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యా శాఖ సిబ్బంది (ఉపాధ్యాయులు) మరియు అంగన్వాడి కార్యకర్తల సమన్వయముతో జరుపబడునని పేర్కొన్నారు. జిల్లాకు సంబంధించి ఐదు లక్షల ఏడు వేల మాత్రలు వచ్చాయని పిల్లలు అంతా విధిగా వేసికోవాలన్నారు. పాఠశాలలో ఉదయం గం. 8-00 లు నుండి సాయంత్రం గం. 5-00ల వరకు నిర్దేశించిన ప్రణాళిక పద్ధతిలో ఈ కార్యక్రమం జరుపబడన్నారు. మధ్యాహ్నం భోజనం తరువాత ప్రతి విద్యార్థికి ఒక మాత్ర (ఆల్బెండజోల్ -400 మీ.గ్రా.) నమిలి తినిపించడం జరుగుతుందన్నారు. ప్రతి పాఠశాలకు ఒక ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షకుడుగా నియమించడం జరిగినదన్నారు. ఆ గ్రామాలలో ఆషా కార్యకర్తలు, అంగన్వాడి కార్యకర్తలు మరియు స్వచ్ఛంద సేవా సంఘాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయవలసినదిగా కోరడమైనదన్నారు. దుష్పరిణామాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న పి. హెచ్. సి

-మిగతా 2లో

# మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలి

- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి
- జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫోన్ చేసి మంత్రి అచ్చెన్నాయుడు కీలక ఆదేశాలు



**నవతరం -నిమ్మాడ**

ప్రముఖ శైవ దేవాలయాలైన ఎండల మల్లికార్జున స్వామి, ఉమా రుద్ర కోటేశ్వర స్వామి, మహేంద్ర తనయ ప్రముఖ దేవాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డిలతో ఫోన్ ద్వారా మాట్లాడి ఏర్పాట్లపై ఆరా తీశారు. దక్షిణ కాశిగా ప్రసిద్ధి చెందిన జలుమూరు మండలం శ్రీముఖలింగంలో ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు జరిగే మహాశివరాత్రి ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని పేర్కొన్న మంత్రి, వారందరికీ సంతృప్తికరమైన దర్శనం కల్పించాలని సూచించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, వంశధార నదిలో పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల్లో ఎక్కడా అంతరాయం కలగకూడదని కలెక్టర్‌కు స్పష్టం చేశారు. అలాగే భద్రతా పరంగా దేవాలయ పరిసరాల్లో నిరంతరం సీసీ కెమెరాల నిఘా ఉండాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీకి సూచించారు. ముఖ్యంగా చక్రతీర్థ స్నానాల సమయంలో భక్తుల రక్షణ కోసం గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర పర్యవేక్షణతో మహాశివరాత్రి వేడుకలను విజయవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను కోరారు.

# ఆదర్శప్రాయుడు దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

- ఏఐసీసీ తొలి దళిత అధ్యక్షుడిగా సంజీవయ్య సేవలు చిరస్మరణీయం
- శ్రీకాకుళంలో ఘన నివాళులు

2లో



# పలాసలో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ.. పేదలను దోచుకుంటారా !

- విచ్చలవిడిగా బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న సిండికేట్
- లైసెన్స్ షాపుల తరహాలో మద్యం అక్రమ అమ్మకాలు
- అధిక ధరలకు మద్యం విక్రయించే వారిపై పలాస ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలి
- అధిక ధరలకు మద్యం విక్రయాలు కొనసాగిస్తే.. ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా)

**నవతరం -పలాస**

మద్యం పాలసీ గురించి గొప్పలు చెప్పుకునే కూటమి ప్రభుత్వంలో ఎమ్మార్పీ ధరల కంటే పెంచి మద్యం విక్రయాలు చేయడం దారుణమని, ప్రధానంగా పలాస నియోజకవర్గంలో అధిక ధరలకు మద్యం అమ్మకాలు కొనసాగిస్తున్న సిండికేట్లు పేద ప్రజలను దోచుకుంటున్నారని పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ , ప్రముఖ సామాజికవేత్త దువ్వాడ శ్రీధర్( బాబా) ఆందోళన వ్యక్తం చేశారు. -మిగతా 2లో



# సాగునీరు అందించేలా ఐక్యంగా ఉద్యమించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు



**నవతరం -కోటబొమ్మాలి**

కోటబొమ్మాలి మండలం జగన్నాథపురంలో కొండపేట లిఫ్ట్‌కు మరమ్మత్తులు చేసి సాగునీరు అందించేలా ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, సిఐటియు జిల్లా కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు పిలుపునిచ్చారు.

వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లిఫ్ట్ పరిధిలోని గ్రామాల ప్రజలు భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు పంచాయతీల్లోని 22 గ్రామాలకు చెందిన సుమారు 2,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్మించిన లిఫ్ట్ నాసిరకం పనుల వల్ల 2020 నుంచే పనిచేయక మూలపడిందని ఆరోపించారు. దీంతో రైతులు పంటలు పండించలేక తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచినా మరమ్మత్తులు చేపట్టకపోవడంపై ప్రశ్నించారు. కొండపేట లిఫ్ట్ పునరుద్ధరణ కోసం జలసాధన కమిటీ

-మిగతా 2లో

ఎడిటోరియల్

# రైతుల కడుపు కొడతారా!

'అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు' అని ఓ పాత సామెత. ప్రస్తుతం దేశంలోని రైతుల పట్ల కేంద్రం అనుసరిస్తున్న తీరుకు ఇది సరిగ్గా అతికినట్టుంది. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలను అమ్మలా అక్కున చేర్చుకోవాల్సిన మోడీ సర్కార్ వారిపై కక్ష కట్టింది. పైగా ఆదుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వాలపై నియంతృత్వపు కొరడా ఝుళిపిస్తోంది. కేరళలోని వామపక్ష ప్రభుత్వం తమ రాష్ట్రంలోని వరి రైతులకు ఇస్తున్న బోనస్‌ను వెంటనే నిలిపి వేయాలంటూ కేంద్రం హుకూం జారీ చేసింది. పండిన పంటకు లాభాల వర్షం కురిపిస్తానంటూనే బీజేపీ సర్కార్ రైతుల సమస్యలను పూర్తిగా విస్మరించింది. కేంద్రం ఎలాగో పట్టించుకోవడం లేదు, కనీసం రాష్ట్ర ప్రభుత్వాలైనా రైతులకు అండగా నిలబడుతుంటే, అదీ భరించలేక పోతోంది. ఇలా ఉత్తర్వుల రూపంలో రాష్ట్ర ప్రభుత్వాలపై నియంతృత్వంగా వ్యవహరిస్తూ రైతుల కడుపు కొడుతున్నది.

వాస్తవానికి వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నంలో ఉంది కేంద్ర సర్కారు. ఆ కుట్రలో భాగంగానే గతంలో మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చింది. వీటికి వ్యతిరేకంగా రైతాంగం పెద్ద ఎత్తున తిరగబడింది. దిమ్మతిరిగిన మోడీ సర్కారు కాస్త వెనక్కు తగ్గింది. కనీస మద్దతు ధరల చట్టం చేస్తానని స్పష్టమైన హామీ కూడా ఇచ్చింది. కానీ దాన్ని ఎప్పుడో అటకెక్కించింది. రైతులను వ్యవసాయా నికి దూరం చేసేందుకు కుట్రలు సాగిస్తోంది. ఏదో ఒక రూపంలో రైతులను ఇబ్బందులు పెట్టి 'ఇక మేము ఈ వ్యవసాయం చేయలేము బాబో' అనేట్టు చేయదల్చుకుంది. భారం భరించలేక రైతులు తప్పుకుంటే వ్యవసాయాన్ని కార్పొరేట్లకు అప్పగించేందుకు గద్దలా కాచు కూర్చున్నది. ఇప్పటికే బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో విద్యుత్ చట్టంలో సవరణలు తీసుకొచ్చి వ్యవసాయ బోర్లకు స్మార్ట్‌మీటర్లు పెట్టింది. కరెంటు బిల్లుల రూపంలో రైతుల రక్తాన్ని జలగల్లా పట్టి పీడుస్తున్నది. మిగిలిన రాష్ట్రాలను కూడా భయపెట్టో, బుజ్జగించో తమ పంచన చేర్చుకోవాలని చూస్తున్నది. అయితే కొన్ని రాష్ట్రాల్లో బీజేపీ పప్పులుడకడం లేదు. ఇందులో కేరళ కొరకరాని కొయ్యగా మారింది.అదే కేంద్రానికి కడుపుమంటగా మారింది కాబోలు!

బీజేపీ సర్కారు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, ముఖ్యంగా రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకించడంలో కేరళలోని వామపక్ష ప్రభుత్వం ఎప్పుడూ ఓ అడుగు ముందే ఉంటుంది. ఒకపక్క సాగు ఖర్చులు పెరిగిపో యాయి. మరో పక్క కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర చాలక రైతులు అప్పులపాలవు తున్నారు. అందుకే కేరళ ప్రభుత్వం రైతులకు బోనస్ అందిస్తూ అండగా నిలిచింది. దాంతో ఆ రాష్ట్రం మోడీ కంట్లో నలుసుగా మారింది. అందుకే ఉత్తర్వుల రూపంలో హెచ్చరికలు జారీ చేసింది. వెంటనే బోనస్ ఆపివేయకపోతే ధాన్యం కొనుగోలు చేసేదే లేదని బెదిరింపులకు పాల్పడింది. అయితే కేంద్రం తమపై ఎన్ని ఆంక్షలు పెట్టినా రైతులకు కనీస మద్దతు ధరతో పాటు బోనస్ కూడా కచ్చితంగా చెల్లించి తీరుతామని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం తేల్చిచెప్పింది. కేంద్రం కొనుగోలు చేయకపోతే సహకారం సంఘాల ద్వారా పైలట్ పద్ధతిలో ధాన్యం కొనుగోలు చేసుకోవాలని నిర్ణయించుకుంది. గతంలోనూ కేంద్రం పెట్టిన ఇలాంటి ఎన్నో ఆంక్షలను కేరళ తిప్పికొట్టింది. తన రాష్ట్ర ప్రజాప్రయోజనాలకే మద్దతిచ్చింది. ఇది కదా అసలైన ప్రజానుకూల ప్రభుత్వమంటే.

తన అనుంగు మిత్రులైన కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయలు రాయితీలిస్తున్న మోడీకి, రైతులను ఆదుకుంటే మాత్రం మింగుడు పడడం లేదు. ఇప్పటికే రైతులకు బోనస్ ఇస్తున్న రాష్ట్రాలలో కేరళ, తెలంగాణతో పాటు ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఉన్నాయి. అలాగే గుజరాత్, రాజస్థాన్‌లో కూడా కొద్దో గొప్పో బోనస్ అందిస్తున్నారు. అయితే ఈ రాష్ట్రాల వారికి ఎవ్వరికీ అందని ఉత్తర్వులు కేవలం ఒక్క కేరళకు మాత్రమే ఎందుకు జారీ చేశారో ఆలోచిం చాల్సిన అవసరమైతే ఉంది. అంటే కేంద్ర సర్కారు ముందు బీజేపీయేతర రాష్ట్రాలనే టార్గెట్ చేసిందనేది ఇక్కడ స్పష్టం. త్వరలో తెలంగాణపై కూడా ఆంక్షలు విధించే ప్రమాదం లేకపోలేదు!

సామాన్యులకు అండగా నిలబడుతున్న రాష్ట్ర ప్రభుత్వా లపై ఆంక్షలు పెట్టేందుకు, ప్రశ్నలను కట్టడి చేసేందుకు మోడీ సర్కారు రోజురోజుకూ బరితెగిస్తోంది. ఇందులో కేరళ రాష్ట్రంపై ఆంక్షలు ఒకటైతే, పీఎం కేర్స్‌ను పార్లమెంటులో ప్రశ్నించే హక్కు లేదంటూ లోక్‌సభ సచివాలయానికి ఉత్తర్వులు జారీ చేయడం మరో దారుణం. అంటే మోడీ సారథ్యంలో నడిచే సహాయ నిధుల వివరాలను ఎవరూ ప్రశ్నించడానికి వీలు లేదని అల్టిమేట్ ఇచ్చింది. కేంద్రం అనుసరిస్తున్న ఈ నియంతృత్వ పోకడలు ఇలాగే కొనసాగితే దేశం మరింత ప్రమాదంలోకి నెట్టివేయబడటం ఖాయం. కనుక ఈ రకమైన చర్యలను ప్రజామద్దతుతో ఎదుర్కోవాలి.

# నరుడే ఈనాడు... వానరుడైనాడు...!

మంచిని మరిచి
వంచన నేర్చి
నరుడే ఈనాడు
వానరుడైనాడు
అంటూ వాపోయాడు
ఓ తెలుగు సినీగేయ రచయిత...

ఔను నరుడే ఈనాడు
నవ్వే నాగుపాములా
నాట్యమాడుతున్నాడు
నమ్మలేని నయవంచకుడైనాడు...

విజ్ఞానపు రెక్కల్ని...
రెపరెప లాడిస్తూ గరుత్మంతుడిలా
చంద్రమండలం దాటి ఎగిరినా...
మనసు మాత్రం...
పొలం మట్టిపొరల్లో ఇరుక్కుపోయింది...

ధనం...
వర్షాకాలపు వరదలా పొంగి పొర్లగా
గుణం మాత్రం...
ఎండిన వాగులో బంక మట్టిగా మారింది

మానవత్వం...
ముద్దబిడ్డలా చేతిలో ఉండగా
స్వార్థం...
మద్యంలా మత్తెక్కి
మానవత్వాన్ని
మురికి కాలువలో ముంచేసింది...

భక్తి...
పూల హారంలా మెడలో
వేసుకున్నా లోభం...
మదిలో పుట్ట గొడుగులా పెరిగింది...

మనిషి...
గుడి గోపురమంత ఎత్తుకు ఎదిగినా
మనసు మాత్రం...
పాతాళగుహలో చిమ్మచీకటిలో మగ్గింది...

నమ్మకం...
గాజు గిన్నెలా పగిలిపోగా
మాట ముళ్ళపొదలా గుచ్చుకుంది...

స్నేహం...
నీడలా వెంట నడిచినా
అవకాశం...
గొడ్డలిలా వెన్నుపోటు పొడిచింది...

ధనం...
ఎడారిలో ఎండమావిలా ఊరిస్తుంటే
ఆత్మ...
దాహంతో అలమటించే ఒంటైంది

అహంకారం...
తుఫాను గాలిలా ఊచకోత కోయగా
మనిషి హోరుగాలికి
ఎండిన ఆకులా ఎగిరిపోయాడు...

నరుడే ఈనాడు
వానరుడిలా వంకరబుద్ధితో
రాక్షసుడిలా రక్తపిపాసిగా
రాబందుగా మారి తాను
తీసిన గోతిలో తానే పడిపోయాడు.



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

## పలాసలో ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ.. పేదలను దోచుకుంటారా !

మొదటిపేజీ తరువాయి

శనివారం ఆయన పలాసలో తన నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతూ, " ఎమ్మార్పీకి మించి మద్యం అమ్మకాలు చేసినా, బెల్ట్ షాపులు ఏర్పాటుచేసిన మొదటిసారి రూ. 5 లక్షలు జరిమానా విధించాలని, రెండోసారి తప్పు చేస్తే షాపు లైసెన్స్ రద్దు చేయాలి "... అంటూ గతంలో ఎక్సైజ్ శాఖలో సమీక్ష సందర్భంగా మద్యం అమ్మకాలపై సీఎం చంద్రబాబు ఆదేశాలు ఇచ్చారని, ఈ హెచ్చరికలను పలాస మద్యం సిండికేట్ వర్గాలు ఏ మాత్రం సీరియస్ గా తీసుకోవడం లేదని దువ్వాడ శ్రీధర్( బాబా) గుర్తు చేశారు. షరా మామూలే అనుకున్నారేమో.. నిబంధనలు పక్కనపెట్టి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగించడమే కాక గ్రామాలలో కూడా బెల్ట్ షాపులు వీధి వీధినా విస్తరింప చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాసలో ఒక ముఖ్య కీలక నేత కను సన్నలలో మద్యం అమ్మకాలు మూడు ఫుల్ బాటిల్స్.. ఆరు బీర్లు అన్నట్లుగా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు.

తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని ప్రదేశాలలో సైతం అన్ని వేళల లోను మద్యం అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. మద్యం వ్యాపారంలో ఆరితేరిన ఒక కీలక నేత నిబంధనలకు పాతరే స్తు , దర్జాగా అధిక ధరలకు మద్యం విక్రయాలు కొనసాగిస్తూ, బెల్ట్ షాపులు విస్తరింపచేస్తూ,ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ, మద్యం వ్యాపారం అడ్డు అదుపు లేకుండా కొనసాగిస్తున్న తీరు దారుణమన్నారు. కోట్ల రూపాయల వ్యాపారం కొనసాగడంతో ఎక్సైజ్ శాఖ అధికారుల చేతులలో అక్రమంగా లక్షల్లో సొమ్ములు చేతులు మారడంతో అధికారులు ఏమి పట్టినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. అధిక ధరలకు అమ్మకాలు కొనసాగించడమే కాక వేళా పాల లేకుండా 24 గంటలు విక్రయాలు జరుగుతున్న పలాస సిండికేట్లు ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలను మించి..

క్వార్టర్ పై రూ. 20 నుంచి 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, ఇంతగా మద్యపాన వినియోగదారుల నుంచి దోపిడీ చేస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ అధికారులు లంచాల మత్తులో జోగుతున్నారని ఆయన మండిపడ్డారు. మద్యం దుకాణంలో ఎంఆర్పి కంటే అధిక ధరలకు విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని జనసేన అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా హెచ్చరించారని ఆయన గుర్తు చేశారు. దేశంలో కొందరు ఎమ్మెల్యేలు అక్రమ కట్టడాలను, బెల్ట్ షాపులను స్వయంగా బుల్డోజర్లతో కూల్చివేసి కఠిన నిర్ణయాలు తీసుకున్న దాఖలాలు ఉన్నాయని, మరి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మద్యం అధిక ధరలకు విక్రయిస్తున్న మద్యం సిండికేట్ లపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూస్తామన్నారు. లేకపోతే తామే స్వయంగా ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని దువ్వాడ శ్రీధర్(బాబా) హెచ్చరించారు.

## సాగునీరు అందించేలా ఐక్యంగా ఉద్యమించాలి

మొదటిపేజీ తరువాయి

ఆధ్వర్యంలో ఐక్య పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి భగాతి వాసు, జలసాధన కమిటీ నాయకులు రెడ్డి లక్ష్మణరావు, సనపల నారాయణరావు, గుంట అప్పన్న, రొక్కం తులసిరావు, బాణాల మురళీకృష్ణ, సనపల ఖజానా, దుప్పల సిమ్మయ్య, గుంట కసవయ్య, గుంట అప్పలరాజు, గుంట లక్ష్మణరావు, సనపల నాగేశ్వరరావు, సనపల లంబోధర్, పాగోటి తయిటయ్య, వాన దిల్లేశ్వరరావు, యాళ్ల భాస్కరరావు, తర అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శప్రాయుడు దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు

నవతరం -శ్రీకాకుళం

దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర విద్యా, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, టీడీపీ సీనియర్ నాయకుడు పిఎంజె బాబు అన్నారు. దామోదరం సంజీవయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ గంజి ఎజ్రా ఆధ్వర్యంలో నగరంలోని ఏడురోడ్ల జంక్షన్‌లో ఉన్న దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవయ్య నిరాడంబర జీవితం, ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిబద్ధత నేటితరం యువతకు ఆదర్శమని తెలిపారు. దామోదరం సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రి, తొలి దళిత ముఖ్యమంత్రి మాత్రమే కాకుండా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ తొలి దళిత అధ్యక్షుడిగా సేవలందించిన గొప్ప నాయకుడని గుర్తుచేశారు. సంయుక్త మద్రాసు రాష్ట్రం, ఆంధ్ర రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వంలో పలు కీలక పదవులు నిర్వహించి ప్రజా సంక్షేమానికి కృషి చేశారని పేర్కొన్నారు. 38 ఏళ్ల వయసులోనే ముఖ్యమంత్రి అయిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సంజీవయ్య పుట్టిన మూడు రోజులకే తండ్రి మునెయ్య మరణించడంతో కుటుంబం మేనమామ వద్ద ప్యాలకుర్తికి వెళ్లిందని, చిన్ననాడే ఎన్నో కష్టాలు ఎదుర్కొంటూ చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. ఆయన జీవిత గాథ యువతకు స్ఫూర్తిదాయకమని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ గంజి ఎజ్రా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండ్రంగి శంకర్, బోనెల అప్పారావు, ప్రధాన విజయరం, కటారి కమల, పోతుల దుర్గారావు, ఎస్వీ రమణ మాదిగ, డి జాన్ తోటరాము, డి గోవింద, సూర్యనారాయణ, దత్తి గోవింద, పాండ్రంగి తారక్, అర్జీ ఈశ్వరరావు, కిరణ్, ఆకుల కృష్ణ, సాయి, మనీ, పీకే ఎంటర్‌టైన్‌మెంట్ సారథి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలందరికీ డీవార్మింగ్ మాత్రలు వేయిద్దాం

మొదటిపేజీ తరువాయి

వైద్యాధికారిని సంప్రదించవలెనన్నారు. జిల్లాలో ఉన్న అన్ని పాటశాలలు.. కళాశాలలు.. కేజిబీవి స్కూల్స్.. అంగన్వాడీ స్కూల్స్ మొదలగు విద్యా సంస్థలకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది వెళ్లి ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, పాదరక్షలు ధరించడం, ఆహారం, నీటిని శుభ్రంగా ఉంచుకోవడం వలన నులిపురుగుల నిర్మూలించవచ్చునని ఆమె అన్నారు.కావున అందరూ కలిసికట్టుగా ముందుకు వచ్చి జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని ఆమె పిలిపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ రాందాస్, డాక్టర్ శివరంజని, డాక్టర్ బి రవీంద్ర, డోమ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గను దర్శించుకున్న ఎమ్మెల్యే మామిడి



నవతరం -పాతపట్నం

విజయవాడలోని శ్రీ కనకదుర్గమ్మను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజల శ్రేయస్సు, అభివృద్ధికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# నిజమైన శివరాత్రి అంటే జాగరణనే...



శివనామాల్లో ముఖ్యమైనవి 'రుద్ర, శివ' నామాలు. 'రుద్ర' అంటే రోదనం పోగొట్టే వాడు. 'శివ' అంటే మంగళకరమైనవాడు. జీవులకు రోదనము పోగొట్టి మోక్షము కలి గించేవాడు శివుడు భోళాశంకరుడు. భక్తవ త్సలుడు. 'మహదేవ' అని ముమ్మారు భగవ న్నామాన్ని భక్తిశ్రద్ధలతో ఉచ్ఛరిస్తే వారికి ఒక్క నామస్మరణకి ముక్తిని ప్రసాదించి, మిగిలిన రెండు నామాలకీ ఋణపడి ఉంటాడు. అంతేకాదు 'మాని యే మహేశస్య ధ్రువమ ప్రజ్ఞానతోపి వా తేషాం కర "తలే ముక్తిః" – ఎవరైతే పరమేశ్వరుని యొక్క నామాలు జ్ఞానం చేత కాని, అజ్ఞానం చేతకాని స్తుతిస్తూ వున్నారో వారికి ముక్తి చేతిలోనే వుంది అని వేదంలో పేర్కొ నబడింది.

మాఘబహుళచతుర్దశినాటి అర్ధరాత్రికాలమున పరమశివుడు కోటిసూర్యకాంతులతో లింగరూపమున ఆవిర్భవించినాడు. కనుక ఈనాటి అర్ధరాత్రి నుండి చతుర్దశి ఉన్న ప్పుడే మహాశివరాత్రి. ఈ మాఘమాస సంబంధము వలెనే ప్రతిమాసమున బహుళచతుర్దశి 'మాసశివరాత్రి' అయినది. – మహా శివముగల రాత్రి మహాశివుని యొక్క రాత్రి మహా శివరాత్రి. శివు డనగా బ్రహ్మానంద స్వరూపుడు. నిర్వికారుడు గనుక శమించియుండువాడనియు ఇతని యందు సజ్జనుల మనస్సులు ఉండుననియు, సాధువుల మనస్సులందు శయనించి యుండువాడనియు, సకల శుభములతో కూడినవాడనియు, శివ శబ్దమునకు అర్థములు. 'శివము' అనగా మంగళము, శుభము, కైవల్యము, శ్రేయస్సు. రాత్రి అనగా సుఖము నిచ్చునది. కనుక గొప్ప శుభముతో కూడినదియు, పరమసుఖమును ఇచ్చునదియు, మహాశివ స్వరూపమైన బ్రహ్మానందమును ప్రసాదించునదియు మహా శివరాత్రి !.

"యశ్శివో నామ రూపాభ్యాం యాదేవీ సర్వమంగళా!తయోః సంస్మరణాత్ పుంసాం సర్వతో జయ మంగళమ్"

మహాదేవుని నామము, రూపమూ శివమే ఆయన పత్ని జగజ్జనని శక్తి స్వరూపిణి సర్వ మంగళ. వారిరువురి స్మరణ అన్నివిధాల జయము, మంగళమును ప్రసాదిస్తాయి. ఐహిక సుఖాలు, పారమార్థిక జ్ఞానము, మోక్షము ప్రసాదించగల సాంబశివుని బ్రహ్మ, విష్ణు, ఇంద్రాది దేవతలు, వశిష్ఠ వ్యాసాది మునీంద్రులు ఆరాధించి అభీష్ట సిద్ధులను పొందినట్లుగా వేద, పురాణేతిహాసాలు విశదీకరిస్తున్నాయి.

మాఘబహుళ చతుర్దశినాడు జీవాత్మ–పరమాత్మ యైన శివునికి చాలా దగ్గరలో ఉంటాడు. సాధన తీవ్ర స్థాయికి వచ్చినపుడు– అమావాస్యస్థితి – అంటే శివైక్య స్థితి సిద్ధిస్తుంది. ఇట్టి శుభలగ్నమే అర్ధరాత్రి శివలింగో ధ్భవకాలం! ఇదే మహాశివరాత్రి. ఇలా భావించి, సాధన చేసి, ఆనందిస్తేనే శివరాత్రి పూజలూ, అభిషేకాలూ, జాగరణ సార్థకమౌతాయి.

## జాగరణం :

జాగరణమన్న పదమునకు 'నిద్ర మేల్కొనుట' అన్న బాహ్యార్థముతో సంతృప్తి చెందక, 'ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ని భోధత,' లెండు, మేల్కొనుడు, గురువుల సేవించి యధార్థమును గ్రహింపుడు అన్న ఉపనిషదర్థము ననుసంధించి, అజ్ఞాన నిద్రనుండి జాగరితులై స్వస్వరూప సంధానమను మహాజాగ్రద్దశ కల్గియుండుటన్న అంతరార్థమును గ్రహించుట. యుక్తము.

జాగరణము : జాగరణ మనగా ఏదో పిచ్చాపాటి మాటలతో, వినోద కార్యక్రమములతో మేల్కొనుట కాదు. – ప్రకృతిలో నిద్రాణమైయున్న శివశక్తిని, శివపూజా భజన – లీలా శ్రవణాదులతో మేల్కొల్పి, తాను శివుడై, సర్వమును – శివస్వరూపముగా భావించి, దర్శించుటయే నిజమైన సూక్ష్మాజాగరణము. అప్పుడు శివపూజలో సాయుజ్యము, శివభజనలో సామీ ప్యము, శివభక్తులతో కూడి, శివ విష యములు ప్రసంగించుటలో సాలో క్యము. శివధ్యానములో సారూప్యము సిద్ధించుననిన ఆదిశంకరుల మాట ప్రత్యక్షర ప్రత్యక్ష సత్యమగును. చతుర్విధముక్తులును ఇహలోకముననే ఈ దేహముతోనే స్వానుభవములోనికి వచ్చును. ఈ నాల్గింటిని శివరాత్రి నాడు ప్రత్యక్షముగా సాధించుటయే శివరాత్రి జాగరణము. నాల్గు జాము పూజలతో మనో బుద్ధి చిత్తా హంకారములు నాల్గును పరిశుద్ధములు కావలెను. ప్రపంచము అశాశ్వతమని యు, బ్రహ్మ మొక్కటే శాశ్వతమనియు గ్రహించి, మన బుద్ధిని మేల్కొల్పుటయే జాగరణము.

జాగరణమంటే మేల్కోవడం. ఆనాడు 33 కోట్ల దేవతలూ ఆ రాత్రంతా మేల్కొని, శివుణ్ణి పూజించి నందున మనమూ శివరాత్రినాడు జాగరణ చేస్తున్నాం. జాగరణమనే పేర్తో, పిచ్చాపాటి మాటలతో, వినోద కార్యక్రమాలతో మేల్కోవడం కాదు. ప్రకృతిలో నిద్రాణమై ఉన్న శివశక్తిని, శివపూజ, భజన, శివలీలలు వినడం మొదలైన కార్యక్రమాలతో మేల్కొల్పి, తాను శివుడై, సర్వాన్నీ శివస్వరూపంగా భావించి, దర్శించడమే నిజ మైన జాగరణ. అపుడు శివపూజలో సాయుజ్యం, శివ భజనలో సామీప్యం, శివభక్తులతో కూడి, శివప్రసంగాలు చేయడంతో సాలోక్యం, శివధ్యానంలో సారూప్యం కనే నాల్గువిధాలైన మోక్షాలూ – జీవించి ఉండగానే, ఒక్కడే లభిస్తాయన్న, శంకరాచార్యుల శివానందలహరి స్తోత్రవాక్యాలు ప్రత్యక్షర సత్యాలవుతాయి. ఇలా చతుర్విధ మోక్షాలను ఈ దేహంతోనే శివరాత్రి నాడు ప్రత్యక్షంగా సాధించడమే శివరాత్రి జాగరణం ! నాల్గు యామాల పూజలతో మనోబుద్ధి చిత్తాహంకారాలు, నాలుగూ పరిశుద్ధం కావాలి. ప్రపంచం అశాశ్వతమనీ, బ్రహ్మమొక్కటే శాశ్వతమనీ గ్రహించి, మన బుద్ధిని మేల్కొల్పడమే జాగరణం!

క్షీరసాగరమథన సందర్భంలో అమృతానికంటే ముందుగా హాలాహల విషాగ్ని జ్వాలలు పుట్టి, లోకాలను దహింపజేస్తున్నాయి... అప్పుడు దేవతలందరూ శివుణ్ణి ప్రార్థించారు. లోకరక్షణతత్పరుడైన పరమశివుడు తన యోగశక్తితో ఆ విషాన్ని ఒక గోళంగా–అంటే చిన్న గుండుబిళ్లగా మార్చుకొని, మింగి కంఠంలోనే నిల్పాడు. తెల్లనిశరీరంగల శివునికి, విషగుళిక కంఠం దగ్గర నల్ల దానాన్ని కల్గించింది. అందువల్ల శివుడు నీలకంఠుడూ, గరళకంఠుడూ అయ్యాడు. ఇంత సాహసంతో లోకానికి మహోపకారం చేసినందున ఆ రాత్రి అంతా దేవతలూ, రాక్షసులూ అందరూ మేల్కొని శివుణ్ణి పూజించడం ద్వారా తమ కృతజ్ఞతలు తెల్పుకొన్నారు. అందుకు సంకేతంగా – లోకానికి సుఖాన్నీ, శుభాన్నీ కల్గించిన శివసంబంధమైన రాత్రి కనుక– మహాశివరాత్రి అనీ, ఆ రాత్రి జాగరణ చేసి, శివుణ్ణి పూజించాలనీ, కూడా పెద్దలు సూచించారు.

శివరాత్రినాడు తెలియక జాగరణం, ఉపవాసం చేసిన వారెందరో శివైక్యం పొందారని పురాణాలు పేర్కొ న్నాయి. ఇక తెలిసి శివరాత్రివ్రతాన్ని ఆచరిస్తే కలిగే మహానందఫలం మాటలకు అందనిది, ఆత్మకు మాత్రమే గోచరించేది అని గ్రహించాలి.

శివరాత్రి నాడు ఉపవాసం ఉండి, రాత్రి నాల్గు జాములలో శివుణ్ణి అభిషేకించి, పూజించి, ఆరాత్రంతా శివకైంకర్యాలతో, స్తోత్రపఠనంతో, శివతత్త్వానుసంధా నంతో జాగరణ చేసి, మరునాడు ఉదయం శివుణ్ణి పూజించి, మహానైవేద్యం చేసి, ఆ ప్రసాదాన్ని స్వీకరిం చాలి. మరునాడు పగలు నిద్రిస్తే, ముందునాడు చేసిన జాగరణ ఫలం వృథా అవుతుంది.

"ఉపవాసమంటే", భగవంతునికి సమీపంలో, సన్నిధిలో ఉండడం. నిరాహారియై ఉండటమనేది సామా న్యార్థం కనుక శరీరధర్మాన్నీ, ఆరోగ్యాన్నీ బట్టి పూర్తిగా నిరాహారంతో ఉండలేనివారు పండ్లూ, పాలూ తీసుకో వచ్చు. సాత్త్వికాహారం పరిమితంగా స్వీకరించవచ్చు. ఆహారంకంటే కూడా, ఇంద్రియాలనూ, మనస్సునూ భగవత్సన్నిధిలో స్థిరంగా, ఏకాగ్రతతో ఉంచటమే నిజ మైన ఉపవాసం! మనస్సూ, ప్రాణాలూ, ఇంద్రియాలూ, ఆత్మ సన్నిధిలో చేరి, ఆనందించడమే నిజమైన శివరాత్రి.




" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
" కవన సాగర "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 :
హయత్ నగర్ :
హైదరాబాదు


# మంచి ప్రయత్నం

**మూవీ రివ్యూ: కపుల్ ఫ్రెండ్లీ**
**తారాగణం: సంతోష్ శోభన్, మానస వారణాశి, యోగి బాబు, రాజీవ్ కనకాల, గోపరాజు రమణ, లివింగ్స్టన్ తదితరులు**
**కెమెరా: దినేష్ పురుషోత్తమన్**
**ఎడిటింగ్: గణేష్ శివ**
**సంగీతం: ఆదిత్య రవిచంద్రన్**
**నిర్మాత: అజయ్ కుమార్ రాజు**
**దర్శకత్వం: అశ్విన్ చంద్రశేఖర్**
**విడుదల తేదీ: 14 ఫిబ్రవరి 2026**



ఈ చిత్రం ట్రైలర్ విడుదలైనప్పుడే ఫీల్ గుడ్ కంటెంట్ ఉండే మూవీ అనే ఇంప్రెషన్ కలగచేసింది. సంతోష్ శోభన్ ప్రతిభగల నటుడు. హీరోయిన్ మానస కూడా ట్రైలర్ తోనే ఆకట్టుకుంది. ఇంతకీ విషయమేంటో చూద్దాం.

శివ (సంతోష్ శోభన్) ఒక బడ్డింగ్ ఆర్కిటెక్ట్. సొంతూరు నెల్లూరు. చెన్నైలో ప్రాజెక్ట్స్ కోసం ప్రయత్నిస్తుంటాడు, కానీ ఒక్కటీ క్లిక్ అవ్వదు. అన్నయ్య ఖర్చులకి డబ్బులు పంపిస్తుంటే ఒక చిన్న అద్దెగదిలో కాలం గడుపుతుంటాడు. ఖర్చులకోసం బైక్ పూలింగ్ చేస్తుంటాడు. అలా మిత్ర (మానస) అనే ఒక అమ్మాయి బైక్ రైడ్ లో పరిచయమవుతుంది. ఆమెది చిత్తూరు. చెన్నైలో లేడీస్ హాస్టల్లో ఉంటూ సాఫ్ట్ వేర్ జాబ్స్ కోసం ప్రయత్నాలు చేస్తుంటుంది. హాస్టల్ ఖాళీ చేయాల్సిరావడం వల్ల వేరే దారి లేక అప్పటికే కాస్త పరిచయమైన శివ రూములో సగం రెంట్ కట్టే కండిషన్ తో చేరుతుంది. అంతే కాకుండా శివకి ప్రాజెక్ట్స్ దక్కడానికి కృషి చేస్తుంది. అలా వారిద్దరి మధ్యన పరిచయం ప్రేమగా మారుతుంది. అయితే అటు ఇటు ఉన్న పెద్దవాళ్లు దానికి అంగీకరిస్తారా లేదా అనే సిచువేషన్లో ఉండగా కథలో పెద్ద ట్విస్ట్. ఆ ట్విస్ట్ ఏమిటి? వారిద్దరి బంధం ఏమౌతుంది..అనేది తక్కిన కథ.

కథ, కథనం రెండూ అలా ఎంగేజ్ చేసి కూర్చోబెడతాయి. ఇద్దరు మెచ్యూర్డ్ యంగ్స్టర్స్ మధ్యన కెమెస్ట్రీ ఎలా మొదలయ్యి, ఎలా పరిణామం చెంది ఎలాంటి తప్పులు చేయిస్తుంది..అంతలోనే మళ్లీ ఎలా కరెక్ట్ చేయిస్తుంది, కీలకమైన జీవితపు మలుపులో ఎలాంటి బాధ్యతను నేర్పుతుంది అనేది నెరేటివ్. ప్రథమార్ధంలో అరగంట వరకు హీరో హీరోయిన్లు బైక్ మీద తిరిగే సీన్లే. రిపీటెడ్ గా కనిపిస్తున్నా బోర్ కొట్టదు. దానికి కారణం నేచురల్ గా ఈజ్ చూపించగలిగే హీరో, కళ్లకి ప్లీజింగ్ గా ఉండే హీరోయిన్ కారణాలు. పాత్రధారుల స్క్రీన్ ప్రెజెన్స్ బాగుంటే కథ అక్కడక్కడే నడుస్తున్నట్టు ఉన్నా బోర్ కొట్టదనడానికి ఇదొక ఉదాహరణ.

కథనం పరంగా చూస్తే చెన్నై సీన్స్ తో పాటు, మరొక టైం లైన్లో కేరళ సీన్స్ కూడా చూపిస్తూ ఒకింత ఆసక్తిని కలిగించాడు దర్శకుడు. ఏదో సస్పెన్స్ ఉందని హింటిస్తూ, దానికోసం వేచి ఉండేలా చేసాడు.

అయితే బరువైన ఆ సస్పెన్స్ ని ఇంఫర్మేషన్ లా కాకుండా, ఇంటెన్స్ మొమెంట్స్ గా మలిస్తే బాగుండేది.

హీరోలో కల్మషం లేని ప్రేమికుడు కనిపించాడు. హీరోయిన్లో ఆర్ద్రమైన ఫీలింగ్ అర్థమయ్యింది. ఇద్దరూ ప్రాక్టికల్ మనుషులే. అంతవరకూ బాగుంది. కానీ వాళ్లల్లో ఎమోషనల్ కోణాన్ని మ్యూజికల్ గా, పర్ఫార్మెన్స్ పరంగా ఇంకా డ్రమటైజ్ చేసుంటే గొప్ప ప్రేమకావ్యం అయ్యుండేదేమో అనిపించింది.

ప్రేమ అంటే కేవలం శారీరక ఆకర్షణ, వయసు వేడి కాదు...అంతకంటే పెద్దదైన బాధ్యత కూడా ఉంటుందని తెలిపిన చిత్రమిది.

ఎక్కడా కామెడీ ట్రాకులు, జోకులు లేవు. ఆద్యంతం సీరియస్ గా సాగే చిత్రమే. సంతోష్ శోభన్ కి ఈ పాత్ర పోషించడం చాలా ఈజీ. ఇతర హీరోలైతే ఏమో కానీ, ఇలాంటి ప్రతిభగల నటుడి నుంచి ఇంకాస్త డ్రామా పండించుకున్నా బానే ఉండేది, "అతి" అనిపించేది కాదు. సీరియస్ గా నడిచే కథ అయినా చివరి దాకా చూడగలిగేలా చేసిన విషయాల్లో సంతోష్ స్క్రీన్ ప్రెజెన్స్ ప్రధానం. మానస వారణాసి కూడా సంతోష్ కి సరితూగేలా నటించింది. హావభావాలు, ఎమోషన్స్, రొమాన్స్ అన్నీ సమతూకంలో పండించింది. మిస్ వరల్డ్ గా భారతదేశాన్ని రిప్రెజెంట్ చేసిన నేపథ్యం గలిగిన ఈమె, గతంలో దేవకి నందన వాసుదేవ లో నటించింది. యోగి బాబు ట్రాక్ ఓకే. రాజీవ్ కనకాల, గోపరాజు రమణ కేరెక్టర్ ఆర్టిస్టులుగా తమ పని తాము చేసారు.

టెక్నికల్ గా చూసుకుంటే, ఇలాంటి సినిమాలకి అద్భుతం అనిపించుకోవాల్సిన సంగీతం యావరేజ్ గా ఉంది. అదొక మైనస్. పాటలు, నేపథ్య సంగీతం రెండూ అంతే.

ఎడిటింగ్ మాత్రం క్రిస్ప్ గా ఉంది. కంటెంట్ 2 గంటల ఒక్క నిమిషంలో ముగియడం బాగుంది. కెమెరా వర్క్ వగైరాలు ఓకే.

కథ, కథనం, మూడ్...గమనిస్తే అలనాటి క్లాసిక్స్ అయిన "సాగరసంగమం", "గీతాంజలి", "వసంతకోకిల" ఛాయలు గుర్తుకొస్తాయి. ఒకే గదిలో హీరో–హీరోయిన్ అద్దెకుండడం అనే ఎలిమెంట్ "ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు" లో ఉండనే ఉంది. వాటి నుంచి ఉద్దేశ్యపూర్వకంగా స్ఫూర్తిపొంది రాసుకున్నా, లేక కేవలం యాదృచ్ఛికాలైనా ప్రయత్నం మాత్రం మంచిదే. అనుకోకుండా కలిసి, మనసులు ఇచ్చిపుచ్చుకుని, హద్దులు కూడా దాటి, పెళ్లి చేసుకోవాలనుకునే సమయంలో ఒక పెద్ద వార్త తెలిసినప్పుడు కూడా ఆ ఇద్దరూ ఎలా బ్రతికారు అనేది చాలా మెచ్యూర్డ్ గా తెరకెక్కించాడు దర్శకుడు. అయితే డ్రామా పండించడానికి ఇంకా ఎంతో స్కోప్ ఉన్నా, ఈ కథ చుట్టూ అద్భుతమైన సంగీత ప్రపంచాన్ని సృష్టించగలిగే అవకాశమున్నా ఆ దిశగా ప్రయత్నం మాత్రం చేయలేదనిపిస్తుంది. బహుశా జెన్ జీ ఆడియన్స్ ఈ కథని ఇంతకంటే డ్రమటిక్ గా చూడలేరని దర్శకుడు ఫిక్స్ అయ్యి ఉండొచ్చు.

# ఆంధ్రప్రదేశ్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ అధ్బుతంగా ఉంది

## ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు



**నవతరం -శ్రీకాకుళం**

ఇది అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇచ్చి జోడెద్దుల బండి వలె పరుగులు పెట్టే బడ్జెట్ అని ప్రశంసించారు. కేంద్ర బడ్జెట్లో వికసిత్ భారత్, రాష్ట్ర బడ్జెట్‌లో స్వర్ణాంధ్ర లక్ష్యం కనిపిస్తుందన్నారు. రహదారులు, విమానాశ్రయాలకు, పోర్టులకు 13వేల కోట్లు కేటాయించడం శుభపరిణామమని అన్నారు. అనుకున్నదానికంటే చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో పవన్ కళ్యాణ్ గారి సహకారంతో మోడీ గారి నేతృత్వంలో మన రాష్ట్రం మరింత ముందుకు వెళుతుందని ఈ బడ్జెట్ నిరూపించింది. ఈ బడ్జెట్ భవిష్యత్ లో విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా , టూరిజం హబ్ గా తీర్చిదిద్దడానికి చేయడానికి జలమిషన్ కార్యక్రమంలో భాగంగా సాగు నీరు త్రాగు నీరు అందేందుకు మరింత ఊతం ఇస్తుంది.

# ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి



**నవతరం -శ్రీకాకుళం**

దామోదరం సంజీవయ్య జయంతిని కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు, ముందుగా సంజీవయ్య పార్కులోని ఆయన విగ్రహానికి డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ, దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లాలోని చిన్న పల్లెటూరులో పేద హరిజన కుటుంబంలో జన్మించారన్నారు. పాఠశాల స్థాయి నుంచే సంజీవయ్య రాజకీయ నాయకుల అనుకరణతో లా చదువు అనంతరం తాత్కాలిక పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై అనంతరం ఆంధ్ర వ్యవహారాలన్నింటిని జవహర్ లాల్ నెహ్రూ హయాంలో ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ వ్యవహారాలను ఆయన చూసేవారని, అనంతరం 1952లో మొదటి ఎన్నికల్లో ప్రత్తికొండ నియోజకవర్గం నుంచి మద్రాస్ శాసనసభకు ఎన్నికయ్యారని, రాజాజీ, టంగుటూరు ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల్ రెడ్డి హయాంలో మంత్రిగా పనిచేశారని, అతిపిన్న వయసులోనే 39 సంవత్సరాలకు ముఖ్యమంత్రిగా, భారతదేశ చరిత్రలో మొదటి దళిత ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌లో ఉండడం గర్వించదగిన విషయమన్నారు. ఎన్నో నూతన పరిశ్రమలు, వృద్ధాప్య పెన్షన్లు, మహిళలకు పాలిటెక్నిక్ కళాశాల, అవినీతి నిరోధక శాఖ, భూసంస్కరణ ప్రవేశపెట్టిన గొప్ప నాయకుడన్నారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీకి అధ్యక్షుడిగా ఉన్నతమైన స్థానాలు అధిరోహించిన ఒదిగివుండే గొప్పతనం పలువురికి ఆదర్శప్రాయమన్నారు. ఈయనకు సంగీతం, సాహిత్యమంటే ఎంతో మక్కువగా ఉండేవారని, అటువంటి నాయకుడు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మార్గదర్శకుడు, ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా దళిత కాంగ్రెస్ నాయకుడు కూరాకుల వెంకట్రావు ను ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో మంత్రి నరసింహమూర్తి, కేవీఎల్ఎస్. ఈశ్వరి, బొడ్డేపల్లి గోవింద్ గోపాల్, బొచ్చ వెంకటరమణ, కొత్తకోట్ల సింహాద్రి నాయుడు, కొత్తకోట్ల లక్ష్మి, ఇజ్జురోతు రమణ, చాన్ బాషా, దేశెల్ల గోవింద మల్లిబాబు, లఖినేని సాయిరాం, బొడ్డేపల్లి శ్రీను, జి.రామారావు, గొల్లపల్లి దాలయ్య, సోడవరం చంద్రరావు, జీపీ.నాయుడు, సురియా బేగం, సీపాన శ్రీరాములు, పిన్నింటి ఆదినారాయణ, ఎం.కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ డిమాండ్..

# బోగస్ మెడిసిన్స్ నిషేధించాలి మెడికల్ మాఫియాను అరికట్టాలి...




**నవతరం -శ్రీకాకుళం**

రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్న మెడికల్ మాఫియా ప్రజల జీవించే హక్కు పై పరోక్షంగా దాడి కొనసాగిస్తుందని, నాణ్యతలేని బోగస్ మందులు విచ్చలవిడిగా మార్కెట్లో ప్రవేశించి వేలాదిమంది ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. ఈరోజు సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా శ్రీకాకుళం జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మాస్యూటికల్ కంపెనీల అధిక లాభాల ఆశ, కార్పొరేట్ ఆసుపత్రుల వ్యాపార ధోరణి, పరీక్షల పేరుతో ల్యాబ్ సెంటర్ల భారీ దందా కలిసి ప్రజలను ఆర్థికంగా శారీరకంగా దోచుకుంటున్నారని అన్నారు. అవసరం లేని టెస్టులు, అధిక ధరల మందులు, నకిలీ ఔషధాలు ఇవన్నీ కలిసి సాధారణ కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపాయని అన్నారు. ప్రభుత్వం ఈ పరిస్థితిని అరికట్టడంలో ఘోర వైఫల్యం చెందిందని, డ్రగ్ కంట్రోల్ వ్యవస్థ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంలో లోపం వహించిందని తద్వారా మెడికల్ మాఫియా కు ప్రోత్సాహం కలిగిస్తున్నాయని అన్నారు. బోగస్ మరియు నాణ్యత లేని మందులపై జిల్లాలో దాడులు నిర్వహించాలని, డ్రగ్ కంట్రోల్ వ్యవస్థను బలోపేతం చేసి బాధ్యులపై కఠిన శిక్షలు విధించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల దందాపై స్వతంత్ర విచారణ కమిటీలు ఏర్పాటు చేయాలని, హాస్పిటల్, ల్యాబ్ సెంటర్లలో టెస్టులు ధరల నియంత్రణ మరియు పారదర్శకతను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైన మందులను ప్రజలకు సరసమైన ధరలకు అందించే విధానాన్ని అమలు చేయాలని అన్నారు. జిల్లాలో కార్పొరేట్ హాస్పిటల్స్ అవసరం లేని టెస్టులు, శస్త్ర చికిత్సలు సూచిస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్నాయని అన్నారు. వందలాది హాస్పిటల్స్ లో ఎక్కడ కూడా మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం నోటీసు బోర్డులు కట్టకుండా, ధరల పట్టికను అమర్చకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయని అన్నారు. ఫార్మాసూటికల్ కంపెనీలు పుట్టుకొచ్చి లాభాల ఆశతో ప్రోబగండ ( పీడీ ) కంపెనీలతో కుమ్మక్కై నాసిరకం మందులు కొనుగోలు చేసి ప్రజా ఆరోగ్యానికి ఇబ్బందులు గురి చేస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవలసిన డ్రగ్ కంట్రోల్ వ్యవస్థ మత్తు నిద్రలో ఉండడం ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వెంటనే జిల్లాలో ఉన్న అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో అనేకమైన పోరాటాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, సిపిఐ నాయకులు చిక్కాల గోవిందరావు, పాపయ్య, భాస్కరరావు, గణేష్, సంతోష్ ఏఐవైఎఫ్ నాయకులు వై వేణు, వసంతరావు, అన్నాజీ, కిషోర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# నిరాడంబరతకు, సామాజిక సంస్కరణలకు నిలువుటద్దం

## - దామోదరం సంజీవయ్య




**నవతరం -శ్రీకాకుళం**

దామోదరం సంజీవయ్య నిరాడంబరతకు మరియు సామాజిక సంస్కరణలకు నిలువుటద్దమని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి(ఎఫ్ ఏ సి) కె.వినాయకం అన్నారు. దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.వినాయకం మాట్లాడుతూ దామోదరం సంజీవయ్య చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి, కష్టాలతో చదువు పూర్తి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 27 నెలల పాటు ఆయన పనిచేశారన్నారు. ఇది రాష్ట్ర చరిత్రలో ఒక రికార్డు అని ఆయన అన్నారు. దామోదరం సంజీవయ్య 38 ఏళ్ల పిన్న వయసులో ముఖ్యమంత్రిగా, రెండు సార్లు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేసిన నిష్కళంక, నిజాయితీ కలిగిన నిస్వార్థ నాయకుడని పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పారిశ్రామికాభివృద్ధికి, ప్రభుత్వంలో తెలుగు వాడకానికి కృషి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీకి తొలి దళిత అధ్యక్షుడిగా రెండుసార్లు బాధ్యతలు నిర్వహించారని, ఖాళీ సమయంలో కవిత్వం, సాహిత్య వ్యాసాలు రాసేవారన్నారు. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడిన నేతగా సంజీవయ్య చిరస్మరణీయులని పేర్కొన్నారు. సంజీవయ్య రిక్షాలో అసెంబ్లీకి వెళ్లేవారని, అత్యంత నిజాయితీపరుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దాసరి తిరుమలరావు,తోట రాము, దండాసి రాము బాబు, రెల్లి సంగం ప్రెసిడెంట్ అర్జి కోటి, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జీవ పరిణామ సిద్ధాంతకర్త చార్లెస్ డార్విన్

## జేవీవీ జిల్లా విద్యావిభాగం నాయకుడు పి మోహనరావు, రాష్ట్ర విద్యా విభాగం కన్వీనర్ గొంటి గిరిధర్





**నవతరం -ఆమదాలవలస**

జవపరిణామ సిద్ధాంతం శాస్త్రీయ దృక్పథానికి పునాది వంటిదని జన విజ్ఞాన వేదిక జిల్లా విద్యావిభాగం నాయకుడు పి మోహనరావు, రాష్ట్ర విద్యా విభాగం కన్వీనర్ గొంటి గిరిధర్ తెలిపారు. చార్లెస్ డార్విన్ జయంతి సందర్భంగా జీవ పరిణామ క్రమాన్ని వివరిస్తూ చార్లెస్ డార్విన్ కృషిని వారు కొనియాడారు. శాస్త్రవేత్తలు బ్రూనో, చార్లెస్ డార్విన్ వంటి మహనీయుల కృషి ఫలితంగానే ప్రజానీకంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందన్నారు. పాఠ్యాంశాలలో జీవ పరిణామ సిద్ధాంతాన్ని, మేండలీఫ్ ఆవర్తన పట్టికను తొలగించడం ద్వారా అశాస్త్రీయ భావనలను సమాజంపై రుద్దడం జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ (హెచ్) ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని,ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించాలని వారు కోరారు. జీవ పరిణామ సిద్ధాంతాన్ని విస్తృతంగా చర్చించి శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రజా సైన్సు సంస్థ జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తుందన్నారు. ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ పైల రవికుమార్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**